క్లుప్తంగా

రుడా వైస్ చైర్మన్ బాలస్వామికి అభినందనలు



బాలస్వామిని అభినందిస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సంఘం జనరల్ సెక్రటరీగా నియమితులైన రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) వైస్ చైర్మన్ బి.బాలస్వామిని మంగళవారం రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, సిబ్బంది సత్కరించారు. తాడేపల్లిలో ఆదివారం జరిగిన రాష్ట్ర అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలస్వామి (సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్)ని జనరల్ సెక్రటరీగా, రుడా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.శ్రావణ్ కుమార్‌ను ఈసీ మెంబర్‌గా ఎన్నికయ్యారు. రుడా సెక్రటరీ జి.శైలజావల్లి, రుడా ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, ఇతర సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

మహారోగి కేంద్రానికి వితరణ


మందులు, ఫ్యాన్లను అందజేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ రాజమండ్రి మోడ్యూల్ ఆధ్వర్యంలో మాజీ జనరల్ సెక్రటరీ వై.తారకనాథ్ వర్ధంతిని మంగళవారం బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్యం కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలోని రోగులకు నాలుగుఫ్యాన్లు, మందులు, భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బి.పాపారావు, వైస్ ప్రెసిడెంట్ డీఎస్ పేరుశాస్త్రి, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జేఎస్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ట్రెజరర్ కె.శ్రీనివాసరావు, రీజనల్ సెక్రటరీ ఎస్‌వీవీఎస్ఎస్ అప్పారావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బర్రే కొండబాబు, డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, 49వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బర్రే కొండబాబు అన్నారు. స్థానిక సుబ్బారావు నగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.ఆశాకిరణ్, స్కూల్ పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు విజయకుమార్, ఉపాధ్యక్షురాలు అప్పల నరస, మహిళా నాయకురాలు సుభాషిణి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం


కానుబోయిన సాగర్

రాజమహేంద్రవరం సిటీ: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాష్ట్రంలో కనీసం మ్యాజిక్ ఫిగర్ స్థానాలకు పోటీచేసే దమ్ము కూడా లేదని ఏపీ ఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్ అన్నారు. ఆయన రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎలా చెబితే, అలా నడిచే పవన్ కల్యాణ్.. వైఎస్సార్ సీపీకి సవాల్ విసరడం హాస్యాస్పదమన్నారు. యువతను తప్పుదారి పట్టించేందుకు, జనసైనికులు, వీర మహిళలను మోసం చేసేలా పవన్ ప్రవర్తిస్తున్నారని, ఇప్పటికీ దిశానిర్దేశం లేకుండా యాత్ర సాగిస్తున్నారన్నారు. వారాహి యాత్ర సినిమా ప్రమోషన్‌లా సాగుతోందన్నారు. ముద్రగడను విమర్శించడం పవన్ కల్యాణ్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఆయనకు దమ్ముంటే కాకినాడ సిటీలో పోటీ చేసి గెలవాలన్నారు.

యోగాపై పోటీలు

రాజానగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బీఈడీ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థులకు బుద్ధివికాసం చెంది, పఠనా శక్తి పెరుగుతుందని, తద్వారా చదువులో బాగా రాణిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బంగారుకొండలకు అండగా..

- ఇళ్లకు వెళ్లి పౌష్టికాహారం కిట్లు అందజేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- చిన్నారుల యోగక్షేమాలపై ఆరా


ఇవాంశిక తల్లికి కిట్ అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత


నాగభూషణం తల్లికి కిట్ ఇస్తున్న జేసీ తేజ్ భరత్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు బలమైన ఆహారం, బాలామృతం, కోడిగుడ్లు, ఇతర అనుబంధ పదార్థాలను అందిస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆమె మంగళవారం ఉదయం స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న రేలంగి ఇవాంశిక నివాసానికి వెళ్లి, బంగారుకొండ కిట్, ఆట వస్తువులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర పౌష్టికాహారలోపం ఉన్న పిల్లలను గుర్తించి, ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. దానికి అదనంగా అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఇవ్వాలని సంకల్పించామన్నారు. ఆ దిశలో జిల్లాలో పౌష్టికాహార లోపం ఉన్న 1,283 మంది పిల్లలను గుర్తించి దత్తత తీసుకునే ప్రక్రియను చేపట్టామన్నారు. ఆరు మాసాలు పాటు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా ఆ చిన్నారుల్లో తగిన ఎదుగుదల, పెరుగుదల వచ్చేలా వ్యక్తిగత పర్యవేక్షణ బాధ్యతలను ఆయా బాలమిత్రలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రేలంగి ఇవాంశిక తల్లి ప్రత్యూషతో మాట్లాడుతూ బంగారుకొండ కిట్‌లో ఇచ్చిన పౌష్టికాహారాన్ని వారికి మాత్రమే అందించాలని, క్రమం తప్పకుండా చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలిస్తారన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీడీ కె.విజయ కుమారి, సీడీపీవో సీహెచ్‌వీ నర్సమ్మ, సూపర్‌వైజర్, ఏఎన్ఎం తదితరులు ఉన్నారు.

జేసీ తేజ్ భరత్ ఆధ్వర్యంలో..

స్థానిక ఇన్నీసుపేటకు చెందిన 28 నెలల జి.నాగభూషణాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ దత్తత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇన్నీసుపేట వాకా అప్పలస్వామి వీధిలోని బాలుడి ఇంటికి వెళ్లి తల్లి పద్మకు బంగారుకొండ కిట్ అందజేశారు. బాలుడి ఎత్తుకుని యోగక్షేమాలను తల్లిని అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

కడియం: మండలం పరిధిలో పలువురు చిన్నారులకు పౌష్టికాహారం కిట్లను వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. చిన్నారుల ఉన్నత భవిష్యత్తుకు కలెక్టర్ కె.మాధవీలత బంగారుకొండ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇందులో భాగంగా రూరల్ నియోజకవర్గంలో మూడువేల మంది చిన్నారులను గుర్తించారన్నారు. వీరికి దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం.సుజాత, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.చంద్రరావు, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి పాల్గొన్నారు.

దత్తత తీసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: పోషకాహారం లోపం గల పిల్లలను దత్తత తీసుకొని, ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహారాన్ని అందించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన బంగారు కొండ పథకం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్, సౌమ్య దంపతులు దత్తత తీసుకున్న గోరక్షణపేటలోని షేక్ ఫారూక్, గోపాల్ నగర్ పుంతలో నివసిస్తున్న కొవ్వాడ దీక్షితను ఇళ్లకు వెళ్లి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం దత్తత తీసుకొన్న పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలిస్తామన్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది 35 మందిని దత్తత తీసుకొని వారికి పౌష్టికాహార కిట్లను అందించారని తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యం

ప్రకాశం నగర్: బంగారు కొండ కిట్ల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా ఇవ్వడం వల్ల పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి అన్నారు. మంగళవారం స్థానిక 46వ డివిజన్ మెహర్ నగర్ చెందిన ఎండీ అయాన్‌ను ఆమె బాలమిత్ర కింద దత్తత తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆ చిన్నారి ఇంటికి వెళ్లి కిట్ అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కలెక్టర్ మాధవీలత ఒక మంచి ఆలోచనలతో బంగారుకొండ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు.


దత్తత తీసుకున్న చిన్నారికి కిట్ అందజేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్, సౌమ్య దంపతులు


అయాన్ యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఆర్డీవో చైత్రవర్షిణి


పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

మర్యాద పూర్వకంగా..


కలెక్టర్ మాధవీలతకు మొక్కను అందజేస్తున్న ఎస్పీ రాజశేఖర్ రాజు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు మంగళవారం కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సాధారణ బదలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

యోగాపై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు: యోగాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నిర్వహించనున్న యోగాడే సందర్భంగా స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి వై.జంక్షన్ వరకూ వైద్యాధికారులతో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ యోగాను మనం జీవితంలో భాగం చేసుకోవాలని, తద్వారా రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ యోగాకు ప్రజలను దగ్గర చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో డేవిడ్ యోగాసనాలు వేశారు. ఎంపీహెచ్ఈవో బి.రాజు, ఎంపీహెచ్ఎస్ ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదల జీవితాలకు భరోసా

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా గడపగడపకూ..


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాలకు భరోసా లభించిందని ఏపీ గ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామ సచివాలయం-3 పరిధిలోని బీబ్లాకులో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చందన నాగేశ్వర్, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న మార్గదర్శకాలపై సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందేలా చూడాలన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సఫారినాయుడు, సచివాలయం -3 కన్వీనర్లు బత్తిన అప్పారావు, రుంకాని రమణమ్మ, పుచ్చా గోవిందరెడ్డి, గ్రామ నాయకులు బొమ్ము శ్రీను, రుంకాని రవి, కుడిపూడి పద్మ, మనోహర్, పగడం లక్ష్మణరావు, ప్రసన్న కుమార్ రెడ్డి, మీగడ గంగాధరం, నామాల సుశీల పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యల పరిష్కారం కోసం జూలై ఒకటి నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిషనర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం వలంటీర్లు, సెక్రటరీలు, పర్యవేక్షణ బృందాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి వారంలో మూడు రోజులు చొప్పున ఐదు వారాల పాటు వార్డు సచివాలయాల వద్ద నిర్దేశించిన రోజులలో శిబిరం నిర్వహిస్తామన్నారు. దీనిలో వలంటీర్లు కీలక పాత్ర వహించాలన్నారు. సదస్సులో అదనపు కమిషనర్ సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి.సాంశివరావు, ఆరోగ్య అధికారి డాక్టర్ వినూత్న, అర్బన్ తహసీల్దార్ సుస్వాగతం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

బాలుర గృహం, కేంద్ర కారాగారం సందర్శన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మంగళవారం బాలుర పర్యవేక్షణ గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. అక్కడి బాలురతో మాట్లాడుతూ చెడు స్నేహాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, అనాలోచితంగా ఏ పనులు చేయరాదన్నారు. బాగా చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వివరించారు. అనంతరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ నేరాలకు పాల్పడడం వల్ల ఎదురయ్యే పరిణామాలు వారితో పాటు వారి కుటుంబ సభ్యులను కూడా బాధిస్తాయన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వివరించారు. అనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా కార్మిక, పోలీసు అధికారులతో సమావేశ మయ్యారు.



బాలుర గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కమీషన్ ఆశ చూపి రూ.11.85 లక్షలు కాజేశారు

ధవళేశ్వరం: అధికంగా కమీషన్ ఇస్తామని ఆశ చూపి ఆన్‌లైన్‌లో రూ.11.85 లక్షలను కాజేశారని రాజవోలులోని రమాదేవి గార్డెన్స్‌కు చెందిన సాలా భానుప్రకాష్ మంగళవారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన సాలా భాను ప్రకాష్ వర్క్‌ఫ్రమ్‌హోమ్‌లో ఉన్నాడు. గత నెల 30వ తేదీన గూగుల్ మ్యాప్‌లో రివ్యూస్ ఇస్తే డబ్బులు ఇస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. అనంతరం భాను ప్రకాష్‌ను గ్రూపులో యాడ్ చేసి మిషన్ టాస్క్ పేరిట బురిడీ కొట్టించారు. రూ.2 వేలు పెట్టుబడి పెడితే 40 శాతం కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. తొలుత రూ.రెండు వేలకు గాను భానుప్రకాష్‌కు రూ.2,800 వేశారు. ఇది నమ్మిన భానుప్రకాష్ దఫాదఫాలుగా రూ.11.85 లక్షలు వేశాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాసనం.. ఆరోగ్య భాగ్యం

- పెరుగుతున్న ఆదరణ
- సంపూర్ణ ఆరోగ్యానికి సాధనం



యోగాలో ప్రతిభ చూపుతున్న రామానుజన్ ఉన్నత పాఠశాల విద్యార్థి సంజయ్ కుమార్, భవితకు శిక్షణను ఇస్తున్న యోగా కోచ్ రాజ్‌కుమార్


కుమారుడు, కుమార్తెతో శ్రీధర్ రెడ్డి యోగా విన్యాసాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నేటి సమాజంలో ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడే సాధనం. ఈ నేపథ్యంలో యోగాకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. పిల్లల నుంచి పెద్దల వరకూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుంటున్నారు. స్థానిక అల్కాట్‌తోటలోని శ్రీనివాస రామానుజన్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసనాల పోటీలలో ఏడేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధిస్తున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం.సంజయ్ కుమార్, ఎం.భవిత ఎన్‌సీఈఆర్‌టీ నేషనల్ యోగా ఒలింపియాడ్-2023 పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టులో ప్రాతినిధ్యం వహించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతున్న జాతీయస్థాయి పోటీలకు వెళ్లారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, యోగా కోచ్ జే.రాజ్ కుమార్ నేతృత్వంలో యోగాసనాలలో శిక్షణ పొందుతున్నారు. వీరితో పాటు పూర్వపు విద్యార్థులు డి.ప్రవల్లిక, ఎస్.దివ్యలక్ష్మి, కె.ఉష, జి.రాధికాదేవి, యశ్వంత్ దుర్గేష్, హరితశ్రీ సైతం ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. ప్రతి రోజూ యోగాసనాలు వేయించడం ద్వారా విద్యార్థులు వివిధ పోటీల్లో రాణిస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు పీకేవీఎన్ సత్యవతి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎం.శ్రీదేవి తెలిపారు.

ఆకట్టుకున్న ఆసనాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం వివిధ రకాల యోగాసనాలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు రమ్య నిత్యం విద్యార్థినులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. ఆ విద్యార్థులను స్కూలు ప్రిన్సిపల్ ఆర్.నాగవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీధర్ రెడ్డి ప్రతిభ

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన కేఎస్‌వీ శ్రీధర్ రెడ్డి యోగాపై ఎందరికో అవగాహన కల్పిస్తున్నారు. ఆయన కుమారుడు కార్తిక్ రామచంద్రారెడ్డి జాతీయ, అంతర్జాతీయ యోగా పోటీల్లో బహుమతులు సాధిస్తున్నాడు. శ్రీధర్ రెడ్డి 2022లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో మొట్టమొదటిగా ప్రవేశపెట్టిన యోగాసనా క్రీడకు ఆంధ్రప్రదేశ్ తరఫున న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అలాగే గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో గిరిజన క్రీడలలో యోగాసనా విభాగానికి కూడా న్యాయనిర్ణేతగా ఉన్నారు. తన కుమారుడు కార్తిక్ రామచంద్రారెడ్డి, కుమార్తె హేమ నిర్మలారెడ్డికి అత్యుత్తమ శిక్షణ ఇస్తూ, వారిని కూడా అంతర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిపారు.

పలు పురస్కారాలు

శ్రీధర్ రెడ్డి యోగాలో చేసిన విశేష సేవలకుగాను తమిళనాడు యోగా అసోసియేషన్ నుంచి యోగారత్న, యోగశిఖామణి బిరుదులను పొందారు. మన రాష్ట్రానికి చెందిన సూర్య యోగా ఫౌండేషన్ ఉత్తమ యోగా టీచర్ అవార్డు, తమిళనాడు యోగా ఫౌండేషన్ తిరుమూలార్ అవార్డు అందజేశాయి. కర్ణాటకలోని శివజ్యోతి యోగాపరిషత్ నుంచి జాతీయ ఉత్తమ యోగా టీచర్ అవార్డు, ఆలోపతికి ఆల్టర్నేటివ్ మెడిసిన్‌గా యోగాను ప్రచారం చేసినందుకు నేషనల్ హోలిస్టిక్ హెల్త్ సైన్సెస్ నుంచి జాతీయ అవార్డు అందుకున్నారు.


బీసీ సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినుల ఆసనాలు

ఆయన అంబాజీపేటలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. 2022లో గుంటూరులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమస్థానం సాధించినందుకు కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. 2022లో విజయవాడలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన యోగాపోటీలలో విజయం సాధించి, అప్పటి ఆయుష్ కమిషనర్ కల్నల్ రాములు చేతుల మీదుగా తండ్రీ కుమారులు కేఎస్‌వీ శ్రీధర్ రెడ్డి, కార్తిక్ రామచంద్రారెడ్డి బహుమతులు స్వీకరించారు.